క్లుప్తంగా

టీటీడీ మెంబర్ నెర్సుకు ఎమ్మెల్యే సత్కారం



టీటీడీ మెంబర్ నెర్సు నాగసత్యంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

దెందులూరు: తిరుమల తిరుపతి దేవస్థానం మెంబర్ నెర్సు నాగసత్యంను ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సత్కరించి అభినందించారు. టీటీడీ మెంబర్‌గా నియమితులై తొలిసారిగా మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని నాగ సత్యం కలిశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే చాంపియన్ షిప్-2023 పోటీల్లో విజయం సాధించిన సెయింట్ మెరిస్ విద్యార్థులు

దెందులూరు: ఏపీ షోటాకాన్ కరాటే ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని విజయదుందుభి మోగించారు. ఆదివారం ఏలూరు టుబాకో కళ్యాణ మండపంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి తనూజ, రెండో బహుమతి మల్లేశ్వరి, విజ్ఞ, అర్పిత మాధ్యూ, త్రిలోచన్, సాత్విక్, సంతోష్ విజయం సాధించారు. తృతీయ బహుమతుల్లో దుర్గా మహేశ్వరి సాధించింది. విజేతలను పాఠశాల హెచ్ఎం సిస్టర్ టీనామరియా, విస్సీలీ మరియా, కరాటే ఇన్‌స్ట్రక్టర్ మణికంఠ, ఇన్‌చార్జి జ్యోతి అభినందించారు.

చిన్నారావుకు నివాళులర్పించిన కొఠారు

పెదవేగి : కుటుంబంలో ఓ వ్యక్తిని కోల్పోవడం ఎవ్వరూ తీర్చలేని లోటని ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండం రాయన్నపాలెంకు చెందిన పలగాని చిన్నారావు ఆదివారం మృతి చెందారు. ఈ విషయమై సమాచారం అందుకున్న కొఠారు చిన్నారావు భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ పరామర్శలు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

శానిటరీ మేస్త్రిపై దాడి

భీమడోలు: స్థానిక గ్రామ పంచాయతీ శానిటరీ మేస్త్రి విధులకు ఆటంకం కలిగించి ఆతనిపై దాడి చేసిన ఓ వ్యక్తిపై భీమడోలు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమడోలు పంచాయతీలో శానిటరీ మేస్త్రిగా బొచ్చా గంగరాజు విధులను నిర్వహిస్తుండగా అదే గ్రామంలోని అరుంధతీ కాలనీకి చెందిన పెరుమాళ్ల రాజేష్ అనే వ్యక్తి పంచాయతీ ఆఫీసులోకి వచ్చి తన ఇంటి వద్ద దసరా సందర్భంగా దుర్గమ్మ విగ్రహాన్ని కొందరు వ్యక్తులు ఏర్పాటు చేస్తున్నారని అడ్డుకోవాలని, లేని పక్షంలో తాను స్పందనలో ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తూ మేస్త్రి బొచ్చా గంగరాజుపై దాడి చేశాడు. అతని చేతిలో ఉన్న హాజరు పట్టీని చించేసి చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు గంగరాజు పోలీసులను ఆశ్రయించాడు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉత్సాహభరితవాతావరణలో జరిగింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. . భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని సామూహిక పుస్తక పఠనం చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఆర్డీఓ కాజీవల్లీ

గణపవరం: ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులో నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీని ఏలూరు ఆర్‌డీఓ కాజీవల్లీ ఆదివారం తనిఖీ చేశారు. కాలనీలో ఇళ్లనిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలను పరిశీలించారు. మౌలిక వసతులకు మంజూరైన రూ.45 లక్షలతో చేపట్టిన రోడ్లు, విద్యుత్, మంచినీటి పైపులైనుల పనుల ఎంతమేర జరిగిందీ? తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కె.జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఎలిశెట్టి పాపారావుబాబ్జి పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్య సాధన అందరి బాధ్యత

ఎమ్మెల్యే వాసుబాబు



ఉంగుటూరు: పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు



గణపవరం: కాశిపాడులో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



భీమడోలు: ప్రధాన రోడ్డును చీపుళ్లతో శుభ్రం చేస్తూ శ్రమదానం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవానీ రంగ



దెందులూరు: స్వచ్ఛత హీ సేవ ర్యాలీలో పాల్గొన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, అధికారులు



పెదపాడు: నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఈఓఆర్డీ సాధనాల సూర్యకుమార్

ఉంగుటూరు: సంపూర్ణ పారిశుద్ధ్య సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం ఉంగుటూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏక్‌తారిఖ్, ఏక్‌గంట, ఏక్‌సాత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి ఆయన శ్రమదానం చేశారు. రోడ్ల పక్కన చెత్తాచెదారం తొలగించడం, రోడ్లు ఊడ్చడం, పిచ్చి మొక్కల తొలగింపు, మురుగునీటి గుంటలు పూడిక తదితర కార్యక్రమాలను నిర్వహించారు, కార్యక్రమంలో వాసుబాబు మాట్లాడుతూ మన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే, ఇంటి పరిసర ప్రాంతాలను, వీధులను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సింధు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంటీసీ సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, తహశీల్దార్ అల్లాడి రమణ పాల్గొన్నారు.

స్వచ్ఛత సాధనకు సమష్టి కృషి అవసరం

గణపవరం: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆగ్రామ ప్రజలంతా ఆరోగ్య వంతులుగా ఉంటారని, ప్రతీ ఒక్కరూ స్వచ్ఛ భారత్ సాధనకు కంకణబద్ధులు కావాలని స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ కూనిరెడ్డి సోమేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం గణపవరం మండలం కాశిపాడు గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్లు, డ్రైయిన్‌లు, పాఠశాల, పంచాయతీ, పిహెచ్‌సి సబ్‌సెంటర్, ఆర్‌బీకే ఆవరణలలో శ్రమదానంతో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు జంపన రమేష్ రాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సిల్వస్టర్‌రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని గ్రామగ్రామాన స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. గణపవరంలో సర్పంచ్ మూర అలంకారం, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంత లక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, ఎంపీటీసీ సభ్యులు దండు రవి, బత్తి సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ జ్యోతిర్మయి పాల్గొన్నారు. సరిపల్లె, కొత్తపల్లి, పిప్పర, కొమ్మర, అర్ధవరం, మొయేరు, ముప్పర్తిపాడు, కేశవరం, కొండేపాడు తదితర గ్రామాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు.

భీమడోలులో..

భీమడోలు: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని భీమడోలు జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. పీఎం నరేంద్రమోడీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని ముందు రోజైన ఆదివారం స్వచ్ఛతా హీ సేవ 2023లో భాగంగా ఏక్ తారీఖ్ ఏక్ ఘంటా ఏక్ సాథ్ కార్యక్రమాన్ని పల్లెల్లో ఉత్సాహంగా నిర్వహించారు. భీమడోలు, పోలసానిపల్లి, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం గ్రామాల్లోని ప్రధాన రహదారులను ఒక గంట సేపు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, క్లాప్ మిత్రలు పెద్ద ఎత్తున చీపుళ్లు పట్టి రోడ్లను పరిశుభ్రం చేశారు. పోలసానిపల్లిలో సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు నిత్యం రద్దీగా ఉండే ద్వారకాతిరుమల రహదారిని, డివైడర్లపై ఉన్న చెత్త చెదారాలను తొలగించారు. గుండుగొలనులో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూళ్లలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ వీధులతో పాటు ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేశారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో పాఠకులు, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి దేవి, ఎంపీటీసీ సభ్యులు అంబటి దేవీ నాగేంద్రప్రసాద్, గంటా శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు ఎస్.ఠాగూర్, సూర్య, ముత్తయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.



నిడమర్రు: పెదనింద్రకొలనులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి

గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవ

దెందులూరు: భారత ప్రధాని మంత్రి మోదీ పిలుపు మేరకు గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛత హీ సేవలో పాల్గొన్నారు. ఆదివారం దెందులూరులో తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, డీఎల్‌పీఓ లక్ష్మి ఆధ్వర్యంలో ఉద్యోగులు దెందులూరు వీధుల్లో బ్యానర్లు చేత పట్టి నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రత అమలుతోనే ఆరోగ్యం, అభివృద్ధి, సంక్షేమం ముడిపడి ఉందన్నారు. అన్ని గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థలు, ఆలయాల్లో, ఆలయ కమిటీలు స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. చెత్తను తొలగించి, రోడ్లను శుభ్రపరిచారు. వాటర్ ట్యాంకులు, చెత్త కుప్పల వద్ద బ్లీచింగ్ చల్లారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తుప్పలు తొలగించారు.

వాడవాడలా స్వచ్ఛత హీ సేవ

పెదపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి పరిశుభ్రం చేసి అనంతరం, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ ర్యాలీ నిర్వహించారు. పెదపాడు, నాయుడు గూడెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పెదపాడు మండల పంచాయతీ విస్తరణాధికారి పాల్గొన్నారు. పెదపాడులో గ్రామ కార్యదర్శి దాగాని వినోద్‌కుమార్, స్థానిక నాయకుడు కొత్తూరు విమలారావు, పారిశుధ్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడమర్రులో..

నిడమర్రు: పారిశుద్ధం పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీటీసీ కోడే కాశి అన్నారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవా-2023లో భాగంగా పెదనింద్రకొలను గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టి, గ్రామ పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, వైస్ ఎంపీపీ బండి రమణ విస్సాకు, ఎంపీటీసీ సభ్యుడు చినిమిల్లి నరసింహమూర్తి, నాయకులు కోడూరి రాంబాబు, దాట్ల శివవర్మ పాల్గొన్నారు.

వైభవంగా వారాల పండుగ



ప్రత్యేకాలంకరణలో పెద్దింట్లమ్మవారు



సుబ్బయ్య వీధిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

దెందులూరు: వారాల పండుగను దెందులూరులో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తులు అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గ్రామంలోని శివాలయం పక్కన సుబ్బయ్యవీధిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఊరేగింపుతో వీధివీధిన గణాసరులకు జలాభిషేకం చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. యువత నృత్యాలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు.

బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుడికి మెరుగైన వైద్య సేవలు

దెందులూరు: బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కామవరపుకోట గ్రామానికి చెందిన పల్లె వెంకటరమణకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఆదివారం జిల్లా వైద్యాధికారులు ఏలూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులతో ఎంపీ ఫోన్‌లో మాట్లాడారు. వెంకటరమణకు మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. ఎంపీ సూచనల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ, కామవరపుకోట వైస్ ప్రెసిడెంట్ మేడూరి రంగబాబు ఆదివారం ఏలూరు వైద్యశాలలో బాధితుడిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటరమణకు పూర్తిగా కోలుకోవడానికి ఎంపీ నిరంతర పర్యవేక్షణ, సహాయ సహకారాలు అందిస్తున్నారని ధైర్యంగా ఉండాలని రంగబాబు చెప్పారు.



ఏలూరు ఆస్పత్రిలో బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రంగబాబు

సంక్షేమం, అభివృద్ధిపై విస్తృత ప్రచారం

పెదవేగి: సీఎం జగనన్న ఆశీస్సులతో దెందులూరు నియోజకవర్గంలో రూ.2,600 కోట్లతో సంక్షేమంతోపాటు అభివృద్ధి పనులు పూర్తి చేయగలిగామని, వీటిపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచించారు. ఆదివారం రాత్రి పెదవేగి మండలం కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధ్యక్షతన నిర్వహించిన దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. దెందులూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని రాబోయే ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించుకుని, దెందులూరు గడ్డపై మరొకసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేస్తామని పార్టీ శ్రేణులు నినదించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే సూచించారు. పార్టీ శ్రేణులు, ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నారు. రాబోయే 6 నెలల కాలంలో గ్రామాల్లోనూ క్షేత్రస్థాయిలో పర్యటించి అందరినీ కలుస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మందికి మంచి అవకాశాలు కల్పిస్తామని, ప్రతి నాయకుడికి, కార్యకర్తకి అన్ని విధాలుగా అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కొండలరావుపాలెం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ప్రజా సంక్షేమానికే పెద్దపీట

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని, పేదల బతుకుల్లో సమూల మార్పులు తేవాలనే సంకల్పంతో సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అన్నారు. సీఎం జగనన్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా రాబోయే ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని ఆయన అన్నారు. ఏలూరు జిల్లా సచివాలయ కన్వీనర్స్, గృహసారథులు (జేసీఎస్) జిల్లా కోఆర్డినేటర్ వైఎస్‌వీ శివరావు ఆదివారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. యువత, విద్యార్థులు క్షేత్రస్థాయిలో సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కొఠారు సూచించారు.

వృద్ధులను గౌరవించడం మన సంప్రదాయం



దెందులూరు: వృద్ధులను సత్కరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, అధికారులు



పెదవేగి: కొప్పులవారిగూడెంలో వృద్ధ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ ఎన్ నాగరాజు



పెదపాడు: వృద్ధులను సన్మానిస్తున్న తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తదితరులు

దెందులూరు: సామాజిక, ఆర్థిక, మానవీయ అభివృద్ధిలో వృద్ధుల పాత్ర చాలా గొప్పదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, డీఎల్‌పీఓ ఏబీపీవీ లక్ష్మి ఆధ్వర్యంలో వృద్ధులను సత్కరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు ప్రపంచమంతా వివక్షకు, సామాజిక బహిష్కరణకు గురవుతున్నారన్నారు. ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 14, 1990న రిజల్యూషన్ పాస్ చేసి ప్రతి అక్టోబర్ 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ప్రభుత్వాలు అనేక చట్టాలు అమలు చేస్తున్నా కుటుంబం నుంచి సమాజం నుంచి వృద్ధులకు గౌరవం, ఆదరణ దూరమయ్యాయన్నారు. పిల్లలపై ఆశలు పెట్టుకుని కని, పెంచి పెద్ద చేస్తే తల్లిదండ్రులను నిరాశ్రయులను చేయడం బాధాకారమన్నారు. ఇటువంటి వ్యవస్థ మారాలని మన అభివృద్ధికి బాటలు వేసిన తల్లిదండ్రులను ఆదరించాలన్నారు.

వృద్ధులకు ఘన సత్కారం

పెదవేగి : ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పెదవేగి మండలంలో తహసీల్దార్ నల్లమెల్లి నాగరాజు ఘనంగా నిర్వహించారు. 80 ఏళ్ల పైబడిన పలువురు వృద్ధులను ఆదివారం శాలువాలు కప్పి సన్మానించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘంతో పాటు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం- 64 పరిధిలోని పెదవేగి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వృద్ధ ఓటర్లను గుర్తించి తహసీల్దార్ నాగరాజు సన్మానం చేసి గౌరవించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్, కూచింపూడి, కొప్పులవారిగూడెం గ్రామాల్లో పర్యటించి పోలింగు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ లెవల్ అధికారులు, ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం

పెదపాడు: ప్రతీ మనిషికి వృద్ధాప్యం వస్తుందన్న విషయాన్ని గుర్తించి వృద్ధులను గౌరవించాల్సిన ఆవశ్యకత ఉందని పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పెదపాడు గ్రామ పంచాయతీ వద్ద వృద్ధులు నరహరశెట్టి లక్ష్మణస్వామి, బూర్లు కాంతమ్మను పూలమాలలతోను, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఈఓ వినోద్, వీఆర్వోలు కే నటరాజన్‌దాసు, బెవర కోటేశ్వరరావు, కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.

నేడు నాయుడుగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదపాడు: మండలంలోని నాయుడుగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల నుంచి నిర్వహించినున్న ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తారని, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అందరూ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన ఇలా..

గణపవరం: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు గణపవరం మండలం కొత్తపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తారు. ఉదయం 9 గంటలకు గాంధీ జయంతి సందర్భంగా పెదనింద్రకొలను గాంధీ భవన్‌లో జరిగే గాంధీ జయంతి కార్యక్రమంలో వాసుబాబు పాల్గొంటారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వినాయక మండపాల వద్ద అన్నసమారాధనలు



బువ్వనపల్లిలో పాటదారునికి లడ్డూ అందిస్తున్న చినబాబు

గణపవరం: వినాయక చవితి ఉత్సవాల ముగింపు వేడుకలు వైభవంగా ముగిశాయి. ఆదివారం గణపవరం వైఎస్సార్ కాలనీ, శివాలయం తోట ప్రాంతాలలో గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం రాత్రి తోటలో జరిగిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. బువ్వనపల్లి రామాలయం వద్ద ఆదివారం గణపతి లడ్డూలకు వేలంపాట నిర్వహించారు. రొయ్యల వ్యాపారి తన్నీడి వాసు ఒక లడ్డూను రూ.16 వేలకు పాడుకున్నారు. మరో రెండు లడ్డూలు సంకు సాయి, సంకు సత్యసాయి వేలం పాటలో దక్కించుకున్నారు. మండల వైఎస్సార్ సీపీ బాధ్యుడు పుప్పాల చినబాబు పాటదారులకు లడ్డూలను అందించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

భీమడోలులో..

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయక చవితి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని భారీ అన్న సమారాధనలు జరిగాయి. ఆలయ ఉత్సవ కమిటిల ఆధ్వర్యంలో భీమడోలు, గుండుగొలను తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిళ్ల వద్ద భక్తులు, ప్రజలు వేలాది మంది ఉత్సాహంగా పాల్గొని స్వామి వారిని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గుండుగొలనులోని 6వ వార్డులోని గంగానమ్మ గుడివద్ద గల ఏర్పాటుచేసిన గణనాథుని ప్రాంగణం వద్ద 3వేల మంది భక్తులు, ప్రజలకు అన్నదానం చేశారు.